సాక్షి
ఒడిశా

గురువారం । 21 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.2,94,354
బంగారం 6 గ్రాముల 50 మిల్లీ గ్రాములు
వెండి 15 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



రౌర్కెలాలో నిలకడగా పరిస్థితి

రౌర్కెలాలో అతిసార పరిస్థితి నిలకడగా కొనసాగుతోందని, క్రమంగా తీవ్రత దిగుముఖం పడుతుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి షాలిని పండిత్ తెలిపారు. - 8లో



మల్కన్‌గిరిలో గవర్నర్ పర్యటన

మల్కన్‌గిరి జిల్లాలో గవర్నర్ రఘుబర్ దాస్ బుధవారం పర్యటించారు. - 8లో

న్యూస్‌రీల్

అనధికారిక పోస్టర్లపై జరిమానా



ఒక స్తంభంపై అనధికారికంగా ఏర్పాటు చేసిన పోస్టర్

భువనేశ్వర్: స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) పరిధిలో వ్యాపార, వృత్తిపరమైన ప్రకటనల కోసం అనధికారికంగా అంటించిన పోస్టర్లు, గోడలపై రాతలు, ప్రకటన తోరణాలకు భారీ జరిమానా వడ్డించారు. నగరంలో పలుచోట్ల అధికారులు చేపట్టిన తనిఖీల్లో గుర్తించిన ప్రకటనలపై చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు దాఖలు చేసి భారీ మొత్తంలో జరిమానా వసూలు చేశారు. ప్రభుత్వ గోడలు, వినియోగ స్తంభాలు, చెట్లపై పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు వేసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారని బీఎంసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ చర్యలను నివారించడంలో బీఎంసీ నిరవధికంగా శ్రమిస్తుందని తెలిపారు.

అగ్ని ప్రమాదంలో 11 దుకాణాలు దగ్ధం



దగ్ధమవుతున్న దుకాణాలు

భువనేశ్వర్: స్థానిక కళింగ స్టేడియం సమీపంలోని అంగడి సముదాయం (వెండింగ్ జోన్)లో అగ్ని ప్రమాదం సంభవించింది. బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో 11 దుకాణాలు దగ్ధమయ్యాయి. కళింగ స్టేడియం ప్రధాన గేటు ఎదురుగా ఉన్న వెండింగ్ జోన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు సమాచారం. అగ్నిమాపక దళానికి సమాచారం అందజేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని సుమారు గంటపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టాన్ని దుకాణదారులు, అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రతాప్ జెనాకు ఊరట

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన మహంగా జంట హత్యల కేసులో అధికార పక్షం బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ జెనాకు కాస్త ఉపశమనం లభించింది. కేసులో సాలేపూర్ ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు (జేఎంఎఫ్‌సీ) ఆదేశాలను సవాలు చేస్తూ ఈయన వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు వచ్చే ఏడాది జనవరి 17కి వాయిదా వేసింది. తదుపరి విచారణ తేదీ వరకు ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ జెనాపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

ఐదుగురు దోపిడీ దొంగలు అరెస్టు



అరెస్టైన దోపిడీ దొంగలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

బరంపురం: స్థానిక రైల్వేస్టేషన్ 4వ ప్లాట్‌ఫారం సమీపంలోని పెట్రోల్ బంకుపై దాడిచేసి దోపిడీకి ప్రయత్నించేందుకు సిద్ధమవుతున్న ముఠాని జీఆర్పీ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. అరెస్టైనవారి దగ్గర నుంచి ద్విచక్ర వాహనం, తుపాకీ, రెండు కత్తులు, ఇనుప రాడ్డు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారిని పట్టుకున్నారు. అరెస్టైనవారిలో కె.గురుములు, రంజన్ సాహు, డి.చిన్నా నాయక్, కె.హరిదొర, ఎం.రామచంద్రలుగా గుర్తించారు.

కీచక ఉపాధ్యాయుడు..?

- విద్యార్థినులతో వికృత చేష్టలు..?
- ఆగ్రహించిన తల్లిదండ్రులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత



ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాయగడ: విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన రాయగడలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక ఇందిరానగర్ ఐదో లైన్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు మనోరంజన్ నాయక్ పని చేస్తున్నాడు. అతడు పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తరగతులు ముగిసిన అనంతరం తరగతి గదిలోకి విద్యార్థినులను రమ్మని పిలిచి వారిపై చేతులు వేసి ఇబ్బందికరంగా ప్రవర్తిస్తుండేవాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పర్యవసనాలు వేరుగా ఉంటాయని భయపెడుతుండేవాడు. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థినులు పాఠశాలకు వెళ్లేందుకు భయపడుతుండేవారు. మరి కొందరు అసలు పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. దీంతో అనుమానం వచ్చిన కొంతమంది విద్యార్థినుల తల్లిదండ్రులు వారిని అడగగా అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో కోపోద్రోకులైన తల్లిదండ్రులు పాఠశాలకు బుధవారం వెళ్లి ఆందోళన చేశారు.

హెచ్‌ఎంకు ఫిర్యాదు

పాఠశాల వద్ద ఆందోళన అనంతరం తల్లిదండ్రులు ఉపాధ్యాయుడి ప్రవర్తనపై హెచ్‌ఎం ప్రమిలా పండకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అతనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఈ విషయమై తన దృష్టికి ఎటువంటి ఆరోపణలు రాలేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం పండ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి ఉపాధ్యాయుడి వికృత చేష్టలపై హెచ్‌ఎంకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు.



హెచ్‌ఎం పండాకు ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు



ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఏ తప్పూ చేయలేదు: ఉపాధ్యాయుడు మనోరంజన్



తాను ఏ తప్పూ చేయలేదని, కావాలనే ఆరోపణలు చేస్తున్నారని ఉపాధ్యాయుడు మనోరంజన్ అన్నారు. విద్యార్థినులతో ఎవరో కావాలని చెప్పించి తల్లిదండ్రులను తనపై ఉసిగొల్పుతున్నారని స్పష్టం చేశారు. మరో ఏడాదిలో తాను ఉద్యోగ రీత్యా పదవీ విరమణ చేయనున్నానని, ఎటువంటి తప్పుడు ఆలోచనలు తనకు లేవని వివరించారు.

భాష సంబరానికి సన్నాహాలు



వివరాలు వెల్లడిస్తున్న చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనా

- రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రపంచ ప్రథమ ఒడియా భాష సదస్సు
- ఫిబ్రవరిలో నిర్వహించేందుకు నిర్ణయం

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారి ప్రపంచ ఒడియా భాష సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో నిర్వహించాలని లాంఛనంగా నిర్ణయించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు. ఈ సదస్సు రాజధాని నగరం భువనేశ్వర్‌లో ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర వారసత్వ మంత్రివర్గం సమావేశంలో సదస్సు ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి అశ్విని కుమార్ పాత్రో మీడియాకు తెలిపారు.

3 రోజుల పాటు సదస్సు

సదస్సుకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి సుజాత కార్తికేయన్ మాట్లాడుతూ తొలిసారిగా నిర్వహించనున్న ప్రపంచ ఒడియా భాషా సదస్సు 3 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. అయితే తుది తేదీలను తర్వాత నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ భాషావేత్తలు, భాషా పరిశోధకులను సదస్సుకు ఆహ్వానిస్తామని తెలిపారు. ఒడియా మాత్రమే కాకుండా ఒడిశాలో ఆచరణలో ఉన్న ఇతర భాషల ప్రచారం, పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. యువతను ఒడియా భాష వైపు ఆకర్షించడమే ఈ సదస్సు లక్ష్యం కాబట్టి పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల విద్యార్థులను సదస్సుకు ఆహ్వానిస్తారు. ఈ చర్చలో ఒడియాను వృత్తిపరమైన పాఠ్యాంశంగా చేర్చడంతోపాటు డిజిటల్ మాధ్యమంలో దాని అప్లికేషన్‌ను చేర్చే చర్యలు ఉంటాయని చీఫ్ సెక్రటరీ తెలిపారు. అంతేకాకుండా బయట దేశాల్లోని ఒడియా సంఘాలు, జగన్నాథ సంస్కృతిని ప్రచారం చేసే వ్యక్తులు, సంస్థలు కూడా సదస్సులో పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఈ సదస్సును నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో ఒడియా భాష వ్యాప్తి, వర్ధమాన తరాల్లో పరిశోధనపై మక్కువ ప్రేరేపిస్తుందన్నారు. ఈ సదస్సు మాతృభాషపై గౌరవ భావాన్ని పెంపొందించి భావి తరానికి భాష ప్రాశస్త్యం గుర్తించేలా ప్రోత్సహించి భాష, సాహిత్యం, సంస్కృతి రంగాల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

ప్రజల సమస్యలు పరిశీలించండి

- సీఎంకు గవర్నర్ రఘుబర్ దాస్ లేఖ
- పర్యటనలో పరిశీలించిన సమస్యల ప్రస్తావన

భువనేశ్వర్: ప్రజల సమస్యలను పరిశీలించాలని రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు బుధవారం లేఖ రాశారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు అంగుల్, ఢెంకనాల్ జిల్లాల్లో క్షేత్ర పర్యటన చేసిన గవర్నర్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. రెండు జిల్లాల పర్యటన సందర్భంగా గవర్నర్ పలువురితో ముఖాముఖి సంభాషించారు. ఈ పర్యటనలో ప్రజలు తెలిపిన సమస్యలను ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

లేఖలో వివరించిన సమస్యలు

ఢెంకనాల్ ప్రాంతంలో మహర్షి దయానంద్ సేవా మిషన్ ఆధ్వర్యంలో జోరండాలో 25 మంది వృద్ధులతో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని పర్యటనలో భాగంగా గవర్నర్ సందర్శించారు. ఈ ఆశ్రమంలో తలదాచుకున్న వృద్ధులకు మౌలిక వసతులు కల్పించేందుకు నిర్వాహక సంస్థ స్థలం తన పేరిట నమోదు చేయాలని అభ్యర్థించింది. అలాగే అంగుల్‌లోని హాకీంపడా వద్ద ఉన్న బాజీ రౌత్ హాస్టల్ సందర్శించిన గవర్నర్ ప్రభుత్వ సహాయం లేని ఈ హాస్టల్ నిర్వహణకు మరిన్ని వనరులు అవసరమని భావించారు. ఈ నేపథ్యంలో హాస్టల్‌కు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగుల్ జిల్లా బనార్‌పాల్ మండలం తురాంగ్ పంచాయతీలో ఆశా కార్యకర్తలు తమ గోడుని గవర్నర్‌కు విన్నవించారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు, కౌన్సెలింగ్ కోసం ఈ ప్రాంతంలో మమతా గృహం నిర్మించాలని అభ్యర్థించారు. మహానది కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (ఎంసీఎల్) మైనింగ్ కార్యకలాపాల వల్ల వాయు, నీటి కాలుష్యంతో స్థానిక నివాసితుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గత 2 ఏళ్లుగా పునరావాసం, పరిసరాల అభివృద్ధి సలహా మండలి (ఆర్‌పీడీఏసీ) ఒక్క సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తమ గోడును వినిపించుకునే అవకాశం లేకుండా పోయిందని బాధితులు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏనుగుల బెడద కారణంగా వ్యవసాయ రంగానికి భారీ నష్టం వాటిల్లుతోందని ఆ ప్రాంత ప్రజలు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ బెడదను అరికట్టేందుకు అటవీ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పీడిత రైతాంగం ఆరోపించింది. అలాగే కందబేరిని ఆశ్రమ పాఠశాలను గవర్నర్ రఘుబర దాస్ సందర్శించారు. ఈ సందర్భంగా సమీపంలోని ఏ ఇతర పాఠశాల అందుబాటులో లేనందున ఈ పాఠశాలలో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరారు. విద్యార్థులకు అదనంగా 100 మందికి వీలుగా హాస్టల్ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. పాఠశాలకు తగిన ఉపాధ్యాయులు మరియు భద్రత కల్పించాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేసినట్లు ముఖ్యమంత్రికి రాసిన లేఖలో గవర్నర్ పేర్కొన్నారు.

బంగారు ఆభరణాల కానుక



కానుకలు అందజేస్తున్న దాత చినుభాయ్ పటేల్



కానుకగా సమర్పించిన వెండి కిరీటాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథునికి ఒక భక్తుడు బంగారు ఆభరణాలు, వెండి కిరీటాలు కానుకగా సమర్పించాడు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన చిరాగ్ చినుభాయ్ పటేల్ అనే భక్తుడు స్వామి వారికి ఈ కానుక సమర్పించాడు. శ్రీ జగన్నాథుని దైనందిన అలంకరణలో వినియోగించే 2 బంగారు బాసికాలు (నుదుటి ఆభరణాలు) కానుకగా అందజేశాడు. వీటి బరువు 1 కిలో గ్రాము 75 గ్రాములుగా పేర్కొన్నాడు. వీటి విలువ సుమారు రూ.75 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. వీటితో పాటు ఆలయంలో పూజించబడుతున్న నారాయణుడు, సాక్షి గోపాలుని కోసం 3 వెండి కిరీటాలు కానుకగా సమర్పించాడు. వీటి విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని అంచనా. చిరాగ్ చినుభాయ్ పటేల్ బుధవారం పూరీ సందర్శించాడు. ఈ సందర్భంగా ఛత్తీస నియోగుల సంఘం ప్రతినిధి జనార్దన్ పట జోషి, మధుసూదన్ సింఘారి ఆధ్వర్యంలో ఊరేగింపుగా ఆలయ కార్యాలయానికి వెళ్లి ఆభరణాలు అందజేశారు. శ్రీమందిరం వర్గాలు అందజేసిన కొలతల ప్రకారం బంగారు, వెండి ఆభరణాలను గుజరాత్‌లో ప్రత్యేక స్వర్ణకారునితో చేయించినట్లు దాత పేర్కొన్నారు. బంగార ఆభరణాల తయారీలో 24 క్యారెట్ల బంగారం వినియోగించినట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

కొరాపుట్: అక్రమంగా తరలిస్తున్న 104 కేజీల గంజాయిని కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జోలాపుట్ సమీపంలో కారులో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులుకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా ఖెముండ్‌పుట్ ప్రాంతంలో కారు పట్టుబడింది. దీంతో కారులో సోదాలు చేయగా గంజాయి లభ్యమైంది. పోలీసులు రాకను ముందుగానే పసిగట్టిన స్మగ్లర్లు పరారయ్యారు. మేజిస్ట్రేట్ సమక్షంలో గంజాయి సీజ్‌చేసి పోలీసుస్టేషన్‌కి తరలించారు. ఈ గంజాయి ఆంధ్ర వైపు తరలించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.



పట్టుబడిన గంజాయి బస్తాలు

గజరాజుల బీభత్సం

- ఆటోపై దాడిచేసిన ఏనుగులు
- ఆటో డ్రైవర్ మృతి
- అడపడా గ్రామంలో విధ్వంసం సృష్టించిన వైనం



కల్లం వద్ద రోధిస్తున్న బాధిత రైతు



సన్నఖేముండిలో ఏనుగుల దాడిలో నేలకొరిగిన ఇల్లు

బరంపురం: గంజాం జిల్లా దిగపండి అటవీ రేంజ్ సన్నొఖేముండి బ్లాక్ పరిధి హడపడా గ్రామంలో మంగళవారం ఏనుగులు సృష్టించిన బీభత్సంలో ఆటో డ్రైవర్ రఘునాథ్ మల్లిక్(40) ప్రాణాలు కోల్పోయాడు. అటవీ అధికారులు, బాధిత గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. హడపడా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రఘునాథ్ మల్లిక్ తన ఆటోలో పాసింజర్లను ఎక్కించుకొని గ్రామ ఆరోగ్య కేంద్రానికి వెళ్తున్నారు. ఆ సమయంలో ఏనుగులు గుంపు వచ్చి వీరిపై దాడికి దిగాయి. దీంతో ఆటోలో ఉన్నవారు పరుగులు తీశారు. అయితే పరుగులు తీస్తున్న ఆటో డ్రైవర్‌ను తల్లి ఏనుగు నేలకేసి కొట్టింది. అనంతరం ఏనుగులు గుంపు తరలిపోవడంతో తీవ్రగాయాలు పాలైన రఘునాథ్ మల్లిక్‌ను అదే ఆటోలో సన్నొఖేముండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. ఎంకేసీజీలో చికిత్స పొందుతూ రఘునాథ్ మల్లిక్ మృతి చెందాడు.

ధాన్యం బస్తాలు ధ్వంసం

అదేరోజు రాత్రి దగ్గరలో ఉన్నటువంటి లకాడి పర్వతాల్లో సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపు అడపడా గ్రామంలోకి చొరబడి విధ్వంసం సృష్టించాయి. గ్రామ శివారులో కల్లాల్లో ఉంచిన ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. సమాచారం అందుకున్న దిగపండి అటవీ రేంజ్ అధికారుల బృందం గ్రామానికి చేరుకొని ఏనుగుల గుంపుని అడవిలోకి తరిమేందుకు ప్రయత్నాలు చేశారు. కాగా జరిగిన ఘటనపై చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలకు అనుగుణంగా ధాన్యం బస్తాలకు, ఆటో డ్రైవర్ రఘునాథ్ మల్లిక్ కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అటపడా గ్రామంలో చెల్లాచెదురైన ధాన్యం బస్తాలు



హడపడా గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

క్లుప్తంగా

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపిస్తున్న పీడీ శాంతిశ్రీ

టెక్కలి రూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెకు దిగడంతో మూతపడిన కేంద్రాలను ఐసీడీఎస్ అధికారులు తెరిపిస్తున్నారు. గర్భిణులకు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందక అనారోగ్యాలకు గురవుతున్నారనే సమాచారం మేరకు బుధవారం ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ టెక్కలి పరిధిలోని శంభానవీధి, గోపినాథపురం, బీసీకాలనీ, చిన్నబ్రాహ్మణవీధి తదితర కేంద్రాలను సచివాలయ సిబ్బంది సాయంతో తాత్కాలికంగా తెరిపించారు. స్టాక్ రికార్డులు పరిశీలించారు. అవసరమైతే సమీప ప్రభుత్వ పాఠశాలల నుంచి పౌష్టికాహారం అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

టెక్కలి నుంచి ఒడిశాకు బస్సు సర్వీసులు

టెక్కలి: టెక్కలి ప్రజా రవాణా డిపో నుంచి ఒడిశా రాష్ట్రం గుణుపూర్ ప్రాంతానికి బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి డిపో నుంచి ప్రతి రోజూ ఉదయం 11.45 గంటలకు బస్సు బయలుదేరి విశాఖపట్నం వెళ్లి, మరళా సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరి శ్రీకాకుళం, నరసన్నపేట, పర్లాఖిమిడి మీదుగా రాత్రి 10 గంటలకు గుణుపూర్ చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు గుణుపూర్‌లో బస్సు బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖ చేరుకుంటుందని వివరించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో 'వలంటీర్' సందడి



ఎమ్మెల్సీపై సన్నివేశం చిత్రీకరిస్తున్న సినిమా బృందం

టెక్కలి: మండలంలోని జీడిపేట, భీంపురం గిరిజన గ్రామాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో శ్రీకృష్ణ లీలా ప్రొడక్షన్ సారథ్యంలో రాజు నిర్మాతగా, వడ్డే వెంకటేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వలంటీర్' సినిమాలో పలు సన్నివేశాలను బుధవారం జీడిపేటలో చిత్రీకరించారు. అవినీతిని ఎదుర్కొనే ప్రజల నాయకునిగా ఎమ్మెల్సీ దువ్వాడ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా గ్రామ వలంటీర్ వ్యవస్థకు రూపకల్పన చేశారని, వారి సేవలను అడ్డుకునేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొడుతూ, ప్రజలకు పూర్తి స్థాయిలో చైతన్యం కల్పించేందుకు ఈ చిత్రానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. విద్యా, వైద్యం, వ్యవసాయంతో పాటు నవరత్నాల విశిష్టతను తెలిపేలా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తయిందన్నారు. జనవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ హాస్పిటల్ రోడ్డులోని డీఎల్‌టీసీ/ఐటీఐలో వివిధ స్వల్పకాలిక శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ వెల్డర్, మల్టీస్కిల్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన పురుషులు అర్హులని పేర్కొన్నారు. టైలరింగ్ కోర్సులో 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు మాత్రమే అర్హులని చెప్పారు. ఈనెల 27లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో శిక్షణా కేంద్రం వద్ద సంప్రదించాలని ఆయన కోరారు.

ఏఆర్ ఎస్‌ఐ కుటుంబానికి సాయం



చెక్ అందచేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ విభాగంలో పనిచేసిన ఏఆర్ ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణ అక్టోబర్‌లో అనారోగ్యంతో మృతిచెందారు. ప్రభుత్వం అడిషనల్ కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష మంజూరు చేయగా ఆ చెక్కును సతీమణి జ్యోతికి ఎస్పీ రాధిక బుధవారం అందచేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

రౌర్కెలాలో నిలకడగా పరిస్థితి

- డయేరియా తగ్గుముఖం పడుతోంది
- రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి షాలిని పండిత్



రౌర్కెలాలో పర్యటించిన వైద్య బృందం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

భువనేశ్వర్: రౌర్కెలాలో అతిసార పరిస్థితి నిలకడగా కొనసాగుతోందని, క్రమంగా తీవ్రత దిగుముఖం పడుతుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి షాలిని పండిత్ తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశీలన బృందం రౌర్కెలా ప్రాంతంలో అతిసార తీవ్రత, తాజా స్థితిగతులను మంగళవారం పరిశీలించింది. ఈ మహమ్మారి 6 మంది ప్రాణాలను ఇప్పటివరకు బలిగొన్నట్లు అధికారిక సమాచారం. రౌర్కెలా ప్రాంతంలో చికిత్స పొందుతున్న అతిసార పీడితులను ఈ బృందం పరిశీలించింది. అనంతరం అన్ని ప్రైవేట్ మెడికల్స్, రౌర్కెలా ప్రభుత్వ ఆస్పత్రి, ఐజీహెచ్, సుందర్‌గఢ్‌లోని మెడికల్ కాలేజీ, హైటెక్ మెడికల్ కాలేజీ అధికారులతో పరిశీలన బృందం సమావేశమైంది.

మరో మూడు రోజుల్లో అదుపులోకి

ప్రస్తుతం కేసులు పెరగకపోవడంతో పరిస్థితి నిలకడగా ఉంది. మరో 2, 3 రోజుల్లో పరిస్థితి అదుపులోకి వస్తుందని భావిస్తున్నారు. సాధారణంగా డయేరియా కలుషిత ఆహారం, నీటితో సంక్రమిస్తుంది. రౌర్కెలా ప్రాంతంలో చికిత్స పొందుతున్న వారు పలు ప్రాంతాలకు చెందినవారు కావడంతో పరిస్థితిని మరింత క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు షాలిని పండిత్ వివరించారు. పీడితులపై ఎపిడెమియాలజీ, మైక్రోబయాలజీ విభాగాలు అధ్యయనం చేస్తున్నాయి. సుందర్‌గఢ్ మెడికల్ కాలేజీలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఈ విశ్లేషణను ప్రారంభించిందని ఆమె తెలిపారు. కటక్ ఎస్సీబీ, భువనేశ్వర్ నుంచి ప్రాంతీయ వైద్య పరిశోధన సంస్థ (ఆర్‌ఎంఆర్సీ) మరో ప్రత్యేక బృందం కూడా అతిసార విస్తరణ, వ్యాప్తి, సంక్రమణ కోణాల్లో ప్రత్యేక అధ్యయనం చేపడుతుంది. వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలను కూడా వారు సూచిస్తారని వివరించారు.

నిరంతరాయంగా సేవలు

రౌర్కెలా నగరంలో 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిరంతరాయం పనిచేస్తాయని ఆమె తెలియజేశారు. ఈ నేపథ్యంలో తగినంత వైద్యులు, పారా మెడిక్స్, యాంటీ బయాటిక్స్, ఆక్సిజన్‌తో సహా మందులను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరిన రోగుల చికిత్స ఖర్చును బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన (బీఎస్‌కేవై) లేదా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) భరిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. రౌర్కెలా, సుందర్‌గడ్‌లోని వివిధ ఆస్పత్రులలో 6 మంది మరణించగా, 100 మందికి పైగా చికిత్స పొందుతున్నట్లు ప్రభుత్వ నివేదికలు పేర్కొంటున్నాయి.

వణికిస్తున్న చలి

- రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రత 5 డిగ్రీల సెల్సియస్ నమోదు



ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
జి.ఉదయగిరి	5.0
ఫుల్బాణి	7.0
కిరి	7.5
అంగుల్	8.0
కొరాపుట్	8.0
సెమిలిగుడ	8.4
దారింగ్‌బాడి	8.5
కెంజొహర్	8.6
రౌర్కెలా	8.6
సుందర్‌గడ్	8.8
భవానీపట్న	8.9
రాణితాల్	9.0
ఝార్సుగుడ	9.2
సోన్‌పూర్	10.0

భువనేశ్వర్: చలితో రాష్ట్రం గజగజలాడుతోంది. అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. గత 24 గంటల్లో 14 చోట్ల రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకి పడిపోయింది. ఈ సీజన్‌లో తొలిసారిగా కందమల్ జిల్లా జి.ఉదయగిరిలో అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం విశేషం. జంట నగరాలైన కటక్, భువనేశ్వర్ ప్రాంతాల్లో సైతం ఈ సీజన్‌లో అతి తక్కువ రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఈ రెండు చోట్ల మంగళవారం రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత 13 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం బుధవారం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల 10 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలో ఎలాంటి మార్పు ఉండదు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉదయం నిస్సారమైన పొగమంచు కురుస్తుందని వాతావరణ కార్యాలయం తెలిపింది.

మల్కన్‌గిరిలో గవర్నర్ పర్యటన



దురువ నృత్య బృందంతో గవర్నర్ రఘుబర్ దాస్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న చిన్నారులు



బహిరంగ సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్

మల్కన్‌గిరి: జిల్లాలో గవర్నర్ రఘుబర్ దాస్ బుధవారం పర్యటించారు. ముందుగా ఉదయం రాజ్‌భవన్ నుంచి బయల్దేరి ప్రత్యేక హెలీకాప్టర్‌లో మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితిలో ఉన్న మినీ స్టేడియం చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు మత్తిలి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. అలాగే సౌకర్యాలపై వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో చర్చించారు. అక్కడి నుంచి పంగం గ్రామానికి వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మల్కన్‌గిరి సమితిలోని కుమార్‌గూడ గ్రామానికి వెళ్లి స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. అక్కడ నుంచి మల్కన్‌గిరి సర్కిట్ హౌస్‌కి చేరుకొని భోజనం చేశారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు మల్కన్‌గిరి జైలు సందర్శించారు. అక్కడ నుంచి చలాన్‌గూడ గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో బహిరంగ సమావేశం నిర్వహించి ప్రధానమంత్రి అవాస్ యోజన పథకంలో ఇళ్లు పొందిన గిరిజనుతో మాట్లాడారు. అలానే చలాన్‌గూడ వద్దనున్న మంచి నీటి సరఫర ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో అక్కడ ఏకలవ్య పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం 6 గంటలకు తిరిగి సర్క్యూట్ హౌస్‌కి చేరుకున్నారు. తిరిగి గురువారం ఉదయం 8 గంటలకు బయల్దేరి జయపురం మీదుగా కొరాపుట్ చేరుకుంటారు. పర్యటనలో ఆయనతో పాటు కలెక్టర్ విశాల్ సింగ్, ఎస్పీ నితీష్ వాద్వానీ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల అణచివేతకు చర్యలు

- ప్రత్యేకంగా 11 శిబిరాలు ఏర్పాటు
- డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్

భువనేశ్వర్: రాష్ట్రంలో మావోయిస్టుల అణిచివేతకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ సునీల్ కుమార్ బన్సాల్ తెలిపారు. స్థానిక పోలీసు భవన్‌లో ఆయన అధ్యక్షతన మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 11 కొత్త పోలీసు శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొత్త శిబిరాల ఏర్పాట్లు మావోయిస్టులపై పోరుని మరింత ప్రభావవంతం చేస్తుందన్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాలు పోలీసులకు పెను సవాల్‌గా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితి ని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సంజీబ్ పండా, అదనపు డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) దేబదత్త సింగ్, ఇంటెలిజెన్స్ డీఐజీ అనూప్ కుమార్ సాహు, స్పెషల్ ఇంటెలిజెన్స్ వింగ్ (ఎస్‌ఐడబ్ల్యూ) డీఐజీ ఉమా శంకర్ దాస్, 10 మావోయిస్టు ప్రభావిత జిల్లాల ఎస్పీలు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ), డీఐజీ, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌ఎఫ్) ఐజీ, డీఐజీలు, బౌధ్, కెంజొహర్ జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

సత్తాచాటిన టెక్కలి విద్యార్థులు

టెక్కలి: కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సదస్సులో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ బుధవారం తెలిపారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అండ్ వర్క్‌షాప్ ఆన్ కన్జర్వేషన్ ఆఫ్ నేచుర్ అండ్ ఆయుష్ మెడిసిన్ ఫర్ యువర్ ఫ్యూచర్ -2023 సదస్సులో భాగంగా బీఎస్సీ విద్యార్థులు నివేదిత, కుమారి, సరితలు హాజరై సంప్రదాయ మెడికల్ ప్లాంట్స్ ఇన్ టెక్కలి పేరుతో ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇందులో విద్యార్థి నివేదితకు బెస్ట్ ప్రెజెంటేషన్ ప్రశంసా పత్రంతో పాటు మిగిలిన విద్యార్థులు కుమారి, సరితలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, చంద్రశేఖర్, ఝాన్సీరాణి, డి.వాసుబాబు పాల్గొన్నారు.

పక్కాగా ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

- రైతులు దళారుల బారిన పడకుండా చర్యలు
- కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది పక్కాగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా తెలియజేశారు. గంజాం జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో కుకుడాఖండి బ్లాక్ పరిధి దక్షణపూర్ సహకార సమితి కార్యాలయంలో ధాన్యం కొలుగోలును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులు దళారులు బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల నుంచి ఆన్‌లైన్ ద్వారా వివరాలు సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణలో గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం అవ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి ఫారం సేకరించి కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి మూడు రోజుల్లో నగదు బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సరోజ్ మిశ్రా, జిల్లా పౌరసరఫరాల అధికారి అజిత్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు నడక పోటీలు



పోటీల్లో గెలిపొందిన విజేతలు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 26వ తేదీ నుంచి జరగనున్న చౌయితి–23 ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా పోలీసు యంత్రాంగం సీనియర్ సిటిజన్ల మధ్య నడక పోటీలను నిర్వహించింది. కొరాపుట్ కూడలి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి హలువ ప్రాంతానికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్ధారించారు. ఈ పోటీల్లో భాగంగా మహిళలు, పురుషుల మధ్య వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. మహిళల మధ్య జరిగిన పోటీలను మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్రా పండ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించగా, పురుషుల మధ్య జరిగిన పోటీలను ఎస్డీపీవో రశ్మీరంజన్ సేనాపతి ప్రారంభించారు. ఉత్సాహంగా కొనసాగిన ఈ పోటీల్లా పోలీసు సిబ్బంది తగు భద్రత చర్యలను తీసుకున్నారు. అడుగడుగునా వారిని అనుసరించి అవసరమైతే గ్లూకోజ్, నిమ్మకాయలు వంటివి అందించే సౌకర్యాలను కల్పించారు.



పోటీల్లో పాల్గొన్న పురుషులు



పోటీల్లో పాల్గొన్న మహిళలు

నృత్య బృందాలు ఎంపిక



నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న చౌయితి–23 ఉత్సవాల్లో భాగంగా చేపట్టనున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నృత్య బృందాల ఎంపిక కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఆడిషన్స్ టెస్టులు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 40 నృత్య ప్రదర్శన బృందాలు పాల్గొని తమ ప్రతిభను కనబరిచాయి. శాస్త్రీయ, జానపద, భక్తి గీతాలకు అనుగుణంగా నృత్య ప్రదర్శనలు చేశారు. వీటిలో 12 బృందాలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. జిల్లా సాంస్కృతిక అధికారి బసంతకుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

చాపరలో చిన్నారి కిడ్నాప్ కలకలం

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన ఘటన బుధవారం కలకలం రేపింది. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారిని ఎత్తుకు పోయినట్లు చిన్నారి తల్లి నాగమణి చెబుతున్నారు. వెంటనే ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లో పనులు చేసుకుంటున్న సమయంలో చిన్నారిని ఎవరో పిలిచారనీ.. తాను బయటకు వచ్చేలోపే బైక్‌పై చిన్నారితో వేగంగా వెళ్లిపోయారని నాగమణి చెప్పారు. ప్రాథమిక వివరాలు బట్టి కిడ్నాప్‌కు పాల్పడినవారు చిన్నారి తల్లిదండ్రులకు తెలిసిన వారే అయి ఉండవచ్చని పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు చెప్పారు. గ్రామానికి అనుసంధానంగా ఉన్న ముఖ్య కూడళ్లలో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని, దుండగులు విశాఖపట్నంవైపు వెళ్లినట్లు భావిస్తున్నామన్నారు. కాగా, చిన్నారి తండ్రి గంగాధర్ అయ్యప్ప మాలధారణలో శబరిమలై వెళ్లినట్లు సమాచారం.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు



విజేతలతో ఎస్ఈ కృష్ణమూర్తి, అధికారులు

అరసవల్లి: ఇంధన పొదుపు వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 15 నుంచి జిల్లాలో అన్ని డివిజన్ కార్యాలయాలు, సర్కిల్ కార్యాలయాల్లో ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఇంధన పొదుపు ఆవశ్యకతపై డ్రాయింగ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఈఈలు ఎస్.బయన్నాయుడు, రాజశేఖర్, ఎల్‌సీహెచ్ పాత్రుడు, సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు

చోరీల కేసులో ఐదుగురు అరెస్టు

టెక్కలి రూరల్ : డివిజన్ పరిధిలో కొద్దిరోజులుగా జరిగిన చోరీ కేసులకు సంబంధించి ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. విశాఖపట్నానికి చెందిన గొల్లవెల్లి సంతోష్ రాజ్‌కుమార్, మెడిశెట్టి నాగరాజు, జి.పవణ్‌కల్యాణ్, సంతబొమ్మాళి మండలం పాత మేఘవరం గ్రామానికి చెందిన నందుపల్లి సంతోష్‌కుమార్, కొత్తూరు మండలం దశరధిపురం గ్రామానికి చెందిన ఇసై రమేష్‌లు ఈ చోరీలకు ప్పాడినట్లు చెప్పారు. సంతోష్‌రాజ్‌కుమార్ విశాఖపట్నం నుంచి కారు అద్దెకు తీసుకుని మిగిలిన సభ్యులతో కలిసి గ్రామాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించేవారు. అర్ధరాత్రి సంబంధిత ఇంటికి చేరుకుని తాళాలు బద్దలు గొట్టి చోరీకి పాల్పడేవారు. ఈ క్రమంలో టెక్కలి పరిధిలోని గోపినాథపురంలో ఓ ఇంట్లో రెండు తులాల బంగారం, సంతబొమ్మాళి మండలం పాతమేఘవరంలో ఆరు తులాల బంగారం, కొత్తూరు మండలం దశరథిపురంలో ఆరు తులాల బంగారం పట్టుకుపోయారు. వీరిందరినీ అరెస్టు చేసి 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

సామూహిక కుంకుమ పూజలు

పాలకొండ: ధనుర్మాసం సందర్భంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో మహిళా భక్తులు బుధవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆడుదాం-ఆంధ్రా పోటీలకు 32వేల రిజిస్ట్రేషన్లు

పార్వతీపురం: ఆడుదాం-ఆంధ్రా పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 32 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. క్రీడాపోటీల నిర్వహణపై తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజుల పాటు జరిగే క్రీడాసంబరాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయడమే పోటీల ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన క్రీడా సామగ్రిని 350 సచివాలయాలకు చేర్చామని, క్రీడా మైదానాలను సిద్ధం చేశామని తెలిపారు.

నాలుగు కేజీల శిశువు జననం



నీలకంఠాపురం పీహెచ్‌సీలో నాలుగుకేజీల బరువుతో జన్మించిన బేబీ

కురుపాం: సాధారణంగా అప్పుడే పుట్టిన శిశువు బరువు రెండున్నర కేజీల నుంచి మూడున్నర కేజీల బరువు ఉంటుంది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం నీలకంఠాపురం పీహెచ్‌సీలో బుధవారం మధ్యాహ్నం నాలుగు కేజీల బరువుగల ఆడబిడ్డ జన్మించినట్టు డాక్టర్ కె.అమరసింహారెడ్డి తెలిపారు. ఒబ్బంగి పంచాయతీ పరిధిలోని పీరంగూడకు చెందిన ఆరిక స్వాతికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీలో చేర్చారు. ఆమెకు వైద్యులు సేవలందించి సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. చికిత్స అందించిన వారిలో స్టాఫ్‌నర్స్ విశేష, ఎంఎల్‌హెచ్‌పీ లలిత, పార్వతి ఉన్నారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థి

రాజాం సిటీ: కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజాం జీఎంఆర్ ఐటీ విద్యార్థి ఎల్.కూర్మినాయుడు ఎంపికైనట్టు పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో రాణించడంతో విద్యార్థిని ఎంపిక చేశారన్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.రాంబాబు, విద్యార్థులు అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి: అలజంగి వేగావతి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణచక్రవర్తి బుధవారం సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

రైతులకు మేలుచేసేలా కేవీకే సేవలు



మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాస్

కురుపాం: గిరిజన రైతులకు మేలుచేసేలా కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధనలు చేస్తోందని, కొత్త కొత్త వంగడాలను సృష్టిస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నైరా వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ కోరారు. కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కేవీకేలలో శాస్త్రవేత్తలు ప్రతినిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక సాగు మెలకువలు తెలియజేస్తారన్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రైతుభరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ టి.ఎస్.ఎస్.కె.పాత్రో, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.అనంత్‌విహారి, నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జి.మోహన్‌నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.జ్యోతిబసు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎ.నిర్మల్ జ్యోతి, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ మౌనిక, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా..



మిల్లుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలు

- ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు
- రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ
- అధికారుల నిరంతర పర్యవేక్షణ
- నూర్పిడిచేసిన వెంటనే కొనుగోలు, రవాణా
- గడువుకు ముందే రైతుల ఖాతాలకు నగదు

పార్వతీపురం టౌన్:

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. రైతులు నూర్పిడిచేసి సిద్ధం చేసిన ధాన్యాన్ని కళ్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఈ బృహత్తర క్రతువులో 185 రైతుభరోసా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ, సివిల్‌సప్లై అధికారులు నిమగ్నమయ్యారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తున్నారు. వెంటవెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయడంతో నిర్దేశిత గడువుకు ముందే రైతుల ఖాతాలకు నగదు జమవుతోంది.

మద్దతు ధరకు కొనుగోలు

రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటా ధాన్యం సాధారణ రకం రూ.2,183, ఎ-గ్రేడ్ ధాన్యం రూ.2,203కు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. రైతన్నకు మద్దతుగా నిలుస్తోంది. గతంలోనూ ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేది. అయితే రైతులు తమకు తెలిసిన కమీషన్ ఏజెంట్లు, మిల్లర్ల వద్దకు ధాన్యం తీసుకువెళ్లేవారు. ఇది దళారుల జోక్యానికి వీలు కల్పించేది. కొనుగోలు కేంద్రలో నిర్ధారించిన తేమ శాతం సరిగా లేదనో.. ఎక్కువ ఉందనో.. పొల్లుగింజలు ఎక్కవ ఉన్నాయనో.. ఇలా రకరకాల కారణాలతో ధాన్యాన్ని మద్దతు ధరకు కోనుగోలు చేసేవారు కాదు. మద్దతు ధరలో ప్రతి బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకు కోత పెట్టేవారు. తద్వారా ఆయా రైతులు ఎకరాకు రూ.2,400 నుంచి రూ.3,300 వరకూ నష్టపోయేవారు. దీనికి తోడు ప్రతికూల వాతావరణంలో పరిస్థితుల్లో రైతుల ఆవేదనను ఆసరాగా చేసుకుని దళారులు మరింత ధర తగ్గించేవారు. ఆన్‌లైన్ అయిన ధ్యాన్యానికి మాత్రమే ప్రభుత్వం సొమ్ము చెల్లించేది. తగ్గించిన బస్తాల సొమ్ము దళారుల పాలై పూర్తిమద్దతు ధర అందక రైతులు నష్టపోయేవారు.



మిల్లుకు తరలిస్తున్న ధాన్యం

పార్వతీపురం మన్యం జిల్లాలో కొనుగోళ్ల వివరాలు..	
ధాన్యం కొనుగోలు కేంద్రాలు	185
ధాన్యం సేకరణ లక్ష్యం	3.23 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటివరకు సేకరించినవి	36 వేల మెట్రిక్ టన్నులు
మిల్లర్ల వద్ద రశీదులు జనరేట్ అయినవి	రూ.80 కోట్లు
రైతులకు చెల్లించిన సొమ్ము	రూ.40 కోట్లు
రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలు	1500

ఇప్పుడు అంతా పారదర్శకమే...

రైతుల కష్టం దళారుల పాలవ్వకుండా, ఏ దశలో నూ వారి జోక్యానికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఈ సారి కోనుగోలు నిబంధనలను కట్టుదిట్టం చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్బీకేల వద్దకు రైతు ధాన్యం శాంపిల్ తీసుకువెళ్తే చాలు.. అక్కడి కొనుగోలు సిబ్బంది తేమ శాతం నిర్ధారిస్తా రు. ఈ-క్రాప్ నమోదుకు లోబడి ఎన్ని టన్నుల ధాన్యం పంపించేదీ ఆన్‌లైన్ చేయగానే ఏ మిల్లుకు తరలించాలో కంప్యూటర్ సూచిస్తుంది. ఆ మిల్లుకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలి. అందుకయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. పండించిన ధాన్యానికి పూర్తి మద్దతు ధర దక్కడంతో రైతు లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సగటున 33 బస్తాల దిగుబడి వస్తుండగా, వివిధ సాకులతో రూ.3,300 వరకూ ఆదదాయం కోల్పోయేవారమని, ఇప్పుడు పూర్తిమద్దతు ధర దక్కుతోందని, గతంలో కోల్పోయిన సొమ్ము ఈసారి ఆదా అవుతోందని రైతులు చెబుతున్నారు.

రైతులకు మేలు



ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శక విధానం అమలుచేస్తోంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం. గతంలో ఏదో ఒక కారణంతో బస్తాకు ఎంతోకొంత కోత వేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పూర్తి మద్దతు ధర అందడంతో ఎకరాకు రూ.2,500పైగా అదనపు ఆదాయం కనిపిస్తోంది.

– వంగపండు శంకరరావు, రైతు, పార్వతీపురం

దళారుల జోక్యానికి చెక్



రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా ప్రభుత్వ ఆదేశామేరకు కొత్త విధానంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రైతు కళ్లాం వద్ద ధాన్యం సేకరించిన నుంచి డబ్బులు ఖాతాకు జమయ్యేవరకు బాధ్యతగా వెళ్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ సాగుతోంది. నిర్దేశిత గడువు 21రోజుల వరకు రైతులు ఎదురు చూడకుండానే ముందుగానే ధాన్యం డబ్బులు జమ చేస్తున్నాం. ఇప్పటివరకు జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు రూ.40కోట్లు చెల్లించాం.

– దేవుళ్ల నాయక్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం

పూర్తిస్థాయిలో కొనుగోలు



రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన కోనుగొలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలి. దళారుల చేతిలో మోసపోవద్దు. ఇప్పటి వరకు జిల్లాలో 36 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించాం. రైతులకు రూ. 40 కోట్లను గడువుకు ముందే చెల్లించాం. గోనెలు, రవాణా చేసేందుకు అయ్యే రవాణా ఖర్చులను సైతం చెల్లిస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయాలు రైతులకు మేలు చేస్తున్నాయి.

– ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం

ఎయిర్‌స్ట్రిప్ భూములు అప్పగించండి

- తహసీల్దార్‌ను కోరిన విశాఖ నావికాదళ అధికారులు

బాడంగి: విజయనగరం జిల్లా బాడంగి సమీపంలో బ్రిటిష్ కాలంనాటి ఎయిర్‌స్ట్రిప్ భూములతో పాటు అవసరమైన పరిసర ప్రాంతాల్లోని భూమిని అప్పగించాలని విశాఖ నావికాదళ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులను కోరారు. ముగ్గురు నావికాదళ అధికారులు బాడంగి తహసీల్దార్ రఫీజాన్‌ను బుధవారం కలిశారు. అనంతరం ఎయిర్‌స్ట్రిప్ భూములను పరిశీలించారు. మరో 1200 ఎకరాలు అవసరంగా పేర్కొంటూ మండల సర్వేయర్ సాయికుమార్ సహాయంతో ఆయాగ్రామాల భూములలో మార్కింగ్ చేపట్టారు. ఆరుపాయింట్లుకు గాను తొలుత ముగడ, కోడూరు, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన భూముల వద్ద మార్కింగ్‌ప్లెగ్‌లు పాతించారు. నావెల్ డాక్‌యార్డుకు చెందిన ముడిసరుకులు, షిప్‌ల నిర్మాణ సామగ్రిని, విడిభాగాలను ఇక్కడ నిల్వచేసి ఎగుమతులు చేసేందుకు నిర్ణయించినట్టు తెలిసింది. భూ సేకరణ ప్రతిపాదనలు కేంద్రప్రభుత్వానికి పంపించారని, అనుమతులు వచ్చిన వెంటనే బహిర్గతం చేస్తారని తెలిసింది. గతంలో ఒకటి రెండు సార్లు వచ్చిన అధికారులు ఏడాది తరువాత తిరిగి రావడంతో ఈ ప్రాంత ప్రజల్లో చర్చమొదలైంది.

ఉన్నత చదువుకు 'విదేశీ విద్యాదీవెన'



విదేశీ విద్యాదీవెన నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, విద్యార్థులు తిలకించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన గంటేడ సత్యసాయి జగనన్న విదేశీ విద్యాదీవెనకు ఎంపికయ్యాడన్నారు. అమెరికాలోని పర్‌డ్యూ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందాడని, విద్యార్థికి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ప్రభుత్వం రూ.9లక్షల65వేల540ల సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద బెలగాంకు చెందిన ఆమిటి హరీష్, వీరఘట్టం మండలం హుస్సేనుపురం గ్రామానికి చెందిన తాడెల కార్తీక్‌కు చెరో లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాన్ని అందజేసినట్టు వెల్లడించారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయంతో విద్యార్థులు ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు.

ఎంతో ఉపయోగం

మాది సాధారణ రైతు కుటుంబం. నేను వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సత్యసాయి జీఆర్‌ఈ టెస్టులో ప్రతిభ కనబరచడంతో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి అర్హుడయ్యాడు. ప్రభుత్వం రూ.9.65 లక్షలు మంజూరు చేసింది. మా లాంటి పేద కుటుంబాల విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గతంలో ఈ స్థాయిలో ఏ ప్రభుత్వమూ సాయం చేయలేదు. మా పిల్లలు జీవితాంతం రుణపడి ఉంటారు.

– గంటేడ శ్రీరాములనాయుడు, ఉద్దవోలు, గరుగుబిల్లి మండలం

ఎస్‌బీఐకి పైడితల్లి బంగారం



అమ్మవారి బంగారు ఆభరణాలను బ్యాంకు అధికారులకు అప్పగిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి, ఆర్‌జేసీ, ట్రస్టు బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన చిన్నపాటి పుస్తెలు, నత్తులు, ముక్కుపుడకలు, తదితర ఐదు కిలోల 75 గ్రాముల బంగారు ఆభరణాలను ఎస్‌బీఐకి ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యుల సమక్షంలో ఈఓ కె.ఎల్.సుధారాణి బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ హుండీల ద్వారా వచ్చిన బంగారాన్ని ఆర్‌జేసీ ఎం.వి.సురేష్‌బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి దుర్గాభవానీ, ధర్మకర్తల మండలి సభ్యులు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావుల సమక్షంలో అందజేశామన్నారు. బంగారాన్ని కరిగించి ఎస్‌బీఐ గోల్డ్ బాండ్ స్కీమ్‌లో పెడతారని తెలిపారు. ఆ డబ్బులతో ఏటా వచ్చే వడ్డీతో ఆలయానికి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ జైల్‌రోడ్డు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

పారిశ్రామిక అవకాశాలు పుష్కలం

- మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
- కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు



టీటీడీసీ ప్రాంగణంలో కూరగాయల విత్తనాలు జల్లుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ జిల్లా అవసరాలకు తగ్గట్టుగా వ్యాపారాలను విస్తరించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి మహిళలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు రానున్న దృష్ట్యా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఉండే పథకాలన్నింటినీ కన్వర్జెన్స్‌తో అందిపుచ్చుకోవాలని, దీనికోసం శిక్షణ ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తిని ఆదేశించారు. మహిళా ప్రాంగణాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. జిల్లా సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తొలుత మహిళా ప్రాంగణం ఆవరణలో మొక్కలు నాటి, మహిళలు నిర్వహించే నర్సరీని సందర్శించారు. అదే ఆవరణలో కూరగాయల విత్తనాలను చల్లి మహిళలతో ముచ్చటించారు. నర్సరీ, కూరగాలయలు, పూలమొక్కల పెంపకంతో వచ్చే ఆదాయవివరాలపై ఆరా తీశారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో సాగుతున్న వ్యాపారాలు, వివిధ కార్యకలాపాలను కలెక్టర్‌కు సమాఖ్య ఈసీ సభ్యులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సూచీల్లో ఆరోగ్యం అత్యంత ప్రధానమైనదని, మహిళా సంఘాల ద్వారా మహిళలు, పిల్లలు రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యజాగ్రత్తలు వివరించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిగా ఆగిపోవాలని, దీనికి మహిళలే నడుంబిగించాలన్నారు. ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో మహిళలు భాగస్వాములుకావాలని, ఆటల్లో రాణించేలా సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారిణులందరూ పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లా సమాఖ్య ద్వారా అనేక ఆర్థిక కార్యకలాపాలు నిర్వర్తిస్తూ రూ.7.8 కోట్లు డిపాజిట్ చేసినట్టు వివరించారు. పౌల్ట్రీ, డెయిరీ, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు సహకరిస్తున్నాయన్నారు. సమావేశంలో ఏపీడీ సావిత్రి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షులు, ఈసీ సభ్యులు, డీపీఎంలు పాల్గొన్నారు.

బైజూస్ పాఠాలకు ట్యాబ్‌లు సిద్ధం

- వరుసగా రెండో ఏడాది పంపిణీకి రంగం సిద్ధం
- జిల్లాకు 17,324 ట్యాబ్‌ల మంజూరు
- సద్వినియోగమయ్యేలా నిరంతర పర్యవేక్షణ: డీఈఓ



ట్యాబ్‌లను మండల కేంద్రాలకు పంపుతున్న పాఠశాలవిద్యా కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్

విజయనగరం అర్బన్: విద్యావ్యవస్థలో బైజూస్ కంటెంట్ బోధన వినూత్నం, విప్లవాత్మకం. ఎంతో ప్రియం అయిన బైజూస్ బోధనలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేరువచేసింది. దీనికోసం ఏటా 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తోంది. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబ్‌ల పంపిణీకి విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. గతేడాది ఉమ్మడి విజయనగరం జిల్లాలో విద్యార్థులు, టీచర్లకు కలిపి మొత్తం 21,448 ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఈ ఏడాది 8వ తరగతి విద్యార్థులతో పాటు కొత్తగా పదోన్నతులు పొందిన సబ్జెక్టు టీచర్లకు ట్యాబ్‌లు అందజేయనుంది. ఇప్పటికే పాఠశాలవిద్య ఉన్నతాధికారులు జిల్లాకు 9,180 ట్యాబ్‌లు పంపించారు. మిగిలిన 8144 ట్యాబ్‌లు రెండుమూడురోజుల్లో రానున్నాయి. ప్రతి ట్యాబ్‌ను మూడేళ్ల వారంటీతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. స్క్రీన్ డామేజీ అయితే ప్రభుత్వమే రిపేరీ చేయించాలని నిర్ణయించింది.

దుర్వినియోగం కాకుండా చర్యలు...

ట్యాబ్‌లను దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం 'టెక్నోరో' అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ భాగస్వామ్యంతో ట్యాబ్‌లలో యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టింది. మూడు యాప్‌ల (వైఫై, బైజూస్, డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. అప్‌డేట్ చేయడానికి ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్‌కు శిక్షణ ఇచ్చి పాఠశాల స్థాయిలోనే అప్డేట్ చేయిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగించింది. డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌లను పరిశీలిస్తారు. సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు నెలకోసారి ప్రతి పాఠశాలనూ సందర్శించి ట్యాబ్‌ల పనితీరును చెక్ చేస్తారు. ట్యాబ్‌ల రిపేరీ బాధ్యతలు కూడా వారే చూస్తారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రతి వారం పాఠశాలను సందర్శిస్తారు. ప్రతి శుక్రవారం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబ్‌లకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

హోరాహోరీగా...

విజయనగరం: నగరంలోని మహిళా పార్కులో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండోరోజు ఆటల పోటీల్లో భాగంగా క్రీడాకారిణులను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు గురువారంతో ముగుస్తాయన్నారు. చరిత్రలో తొలిసారి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ముగింపు కార్యక్రమంలో వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన విజేత జట్లకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు చొప్పున నగదు, ట్రోఫీలను అందజేస్తామన్నారు. పోటీల్లో మహిళలు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు.



మహిళల కబడ్డీ కబడ్డీ